తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు రూపొందించి తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో రిజర్వాయర్ల ద్వారా సుస్థిరమైన సురక్షిత తాగునీరు అందించేందుకు తలపెట్టిన ప్రాజెక్టు ప్రణాళికల సన్నద్ధతపై సంబంధిత ఆర్డబ్ల్యుఎస్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సరఫరా, అలాగే గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలన్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లోని అన్ని ప్రాంతాల్లో సమృద్ధిగా తాగునీరు అందేలా ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. అందుకు సంబంధించి చేపట్టాల్సిన పనులను ప్రతిపాదనలను అందజేసి త్వరితగతిన పనులను పూర్తి చేయాలన్నారు.

ఏప్రిల్ 6 నుంచి ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

- 11న సీతారాముల కల్యాణం
- ఏర్పాట్లు పరిశీలించిన టిటిడి ఇఒ, కలెక్టర్
- ఉత్సవాలపై అధికారులకు దిశానిర్దేశం

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఏప్రిల్ 6 నుండి15 వరకు ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారని, అదే నెల 11న నిర్వహించబోయే శ్రీ సీతారాముల కల్యాణానికి ఎలాంటి లోటు పాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాటు చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధితాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక టిటిడి కల్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవనం సమావేశపు హాలులో టిటిడి ఇఒ జె. శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడుతో కలిసి కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా, టిటిడి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారని చెప్పారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా, టిటిడి అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే అవకాశమున్నందున అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఆ మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా టిటిడి, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. రాములవారి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు కళ్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన ఒక్కో గ్యాలరీకి ఒకరిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామన్నారు. ఎక్కడా కూడా జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉమ్మడి కడప జిల్లాల నుంచి బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కడప, రాజంపేట, రాయచోటి వైపు నుంచే ఆర్‌టిసి బస్సులకు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాల నుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకుని పక్కాగా ప్లాన్ రూపొందించుకుని ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఉచిత బస్సుల సౌకర్యంపై ఎప్పటికప్పుడు సమాచారం తెలియచేయాలన్నారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన అన్ని రకాల మౌలిక, కనీస వసతులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని పేర్కొన్నారు. టిటిడి ఇఒ మాటాడుతూ ఈనెల చివరి నాటికి ఒంటిమిట్ట రామాలయంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, కల్యాణ వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. కడప జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలన్నారు. ప్రతి 15 రోజులకోసారి పనుల ప్రగతిని సమీక్షిస్తానని చెప్పారు. ఇఒ మాట్లాడుతూ శ్రీ సీతారాముల కల్యాణానికి విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వేడుకగా నిర్వహించే కల్యాణానికి లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్య ంలో టిటిడి అధికారులు, కడప జిల్లా అధికారులు సమన్వయంతో పనిచే యాలని సూచించారు. కడప జిల్లా ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ పటిష్ట బారికేడింగ్‌ను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను విజ యవంతం చేసేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్ర మంలో కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, డిఆర్‌డిఎ , మెప్మా పీడిలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు, టూరిజం అధికారి సురేష్ , డిఎంహెచ్ఒ డా.నాగరాజు, డిపిఒ రాజ్యలక్ష్మి, ఆర్‌టిసి ఆర్ఎం ప్రసాద్ రెడ్డి, టిటిడి పిఆర్ఒ రవి, సమాచార శాఖ ఏడీ వేణుగోపాల్ రెడ్డి, టిటిడి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లును పరిశీలించిన ఇఒ,జెఇఒ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా కలెక్టర్ శ్రీధర్, చెరుకూరి, ఎస్‌పి అశోక్‌కుమార్‌తో కలిసి టిటిడి ఇఒ జె శ్యామలరావు, జెఇఒ వీరబ్రహ్మం ఆలయ పరిసరాలు, కల్యాణ వేదిక ప్రాంతాలను శనివారం పరిశీలించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఒంటిమిట్ట ఆలయం పరిసరాలు, కల్యాణ వేదిక సమీపంలో ట్రాఫిక్ , భద్రతా, క్యూలైన్లు, అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, స్వామివారి తలంబ్రాలు పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

మార్చి 5 నుంచి 9 వరకు మహాసంప్రోక్షణ మహోత్సవం

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో మార్చి 5 నుండి 9వ తేదీ వరకు మహా సంప్రోక్షణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు టిటిడి ఇఒ జె. శ్యామల రావు తెలిపారు. గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం గత ఏడాది సెప్టెంబరు 6 నుండి 8 వరకు 'బాలాలయం' నిర్వహించామన్నారు. ప్రస్తుతం పనులు పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. మహాసంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు.

ఆలయంలో ఏర్పాట్ల పనులను పరిశీలిస్తున్న టిటిడి ఇఒ, జెఇఒ

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మొదటి రోజు 710 మంది విద్యార్థులు గైర్హాజర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాలలో ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రతి కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాటు చేశారు. పరీక్ష మొదటి రోజు కావడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకున్నారు. తమ హాల్ టికెట్లు నంబర్లను బోర్డుపై వెతుక్కునేందుకు ఎగబడ్డారు. విద్యార్థులతో పాటు పరీక్ష కేంద్రాల వద్దకు తల్లిదండ్రులు చేరుకోవడంతో కేంద్రాల వద్ద రద్దీగా మారింది. అధికారులు హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులను సెంటర్లోకి అనుమతించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ అభ్యర్థులు 16,524 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 15,917 మంది హాజరయ్యారు. 607 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు సంబంధించి 1,382 మంది హాజరు కావాల్సి ఉండగా 1,279 మంది హాజరయ్యారు. 103 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 17,906 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 17,196 మంది హాజరయ్యారు. 710 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి డీబార్లు నమోదు కాలేదు. ఆర్‌జెడి రవి, ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రతి గ్రామానికీ ఆర్థిక పరిపుష్టి చేకూరాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రాధాన్యతా రంగాలను పటిష్టం చేసి గ్రామాల ఆర్థిక పరిపుష్టితో పాటు రైతులను లాభాల బాటలో నడిపించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని ప్రాధాన్యతా రంగ శాఖలు సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు అవసరమైన చర్యలు చేపట్టాలని, ముందుగా ప్రతి మండలంలోని ఒక్కో గ్రామాన్ని పైలెట్ గా ఎంపిక చేసి 100 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రారంభించాలన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా వీరపునాయుని పల్లె మండలంలోని కృష్ణం పల్లె గ్రామాన్ని ఎంపిక చేశామన్నారు. అందులో భాగంగా ఆ గ్రామంలో అన్ని ప్రధాన్యత రంగాలకు సంబంధించి అన్ని రకాల వనరులను సద్వినియోగం చేస్తూ ఆ గ్రామానికి ఆర్థిక పరిపుష్టి చేకూర్చుతామన్నారు. జిల్లాలో ఔత్సహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేలా బ్యాంకు అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి 1 నుంచి 30 వరకు పశుసంవర్ధక శాఖ అధికారులు చేపట్టే కార్యక్రమాలపై రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ప్రాజెక్ట్ ఎస్.ఈ. వెంకట్రామయ్య, వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జెడి డాక్టర్ శారదమ్మ, వివిధ ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన బడ్జెట్ : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని,ముఖ్యంగా యువతకు భరోసా లేదని, సూపర్ సిక్స్‌లో భాగమైన నిరుద్యోగ భృతి లేదని, ఎన్నికల హామీలలో వాలంటీర్లకు ఇచ్చిన హామీ లేదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాలశివకుమార్ అన్నారు. బడ్జెట్‌పైన శనివారం జిల్లా కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, ముఖ్యంగా కడప జిల్లా ప్రజలు రాష్ట్ర బడ్జెట్ పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, తీరా బడ్జెట్ చూస్తే ఆశలపై నీళ్ళు చల్లినట్లయిందని తెలిపారు. కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడంతో దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ప్రధాన భాగమైన నిరుద్యోగ భృతి రాష్ట్రంలోని చదువుకున్న నిరుద్యోగులకు ప్రతినెల రూ.3000 ఇస్తామని చెప్పి ఎన్నికలలో హామీ ఇచ్చిన ప్రభుత్వం గడిచిన 8 నెలలైనా గాని ఆ హామీ నెరవేరే కార్యరూపణ దాల్చలేదన్నారు. వాలంటీర్లకు ఇచ్చిన హామీని అమలు పరచాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, విజయ్ పాల్గొన్నారు.

లైబ్రరీ బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ :రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు రూ.266 కోట్ల లైబ్రరీ సెస్స్ బకాయిలను జిల్లా గ్రంథాలయ సంస్థలకు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మంగళగిరి లోని ఆంధ్రప్రదేశ్ ప్రాపర్టీ టాక్స్ బోర్డు డైరెక్టర్ అఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం మెంబర్ సెక్రటరీ సి.అనురాధకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రజల నుంచి ఆస్తి పన్నులో లైబ్రరీ సెస్స్ కింద రూపాయికి 8 పైసలు వసూలు చేస్తున్నారని, వసూలు అయిన మొత్తం ఆయా జిల్లా గ్రంథాలయ సంస్థల నిధులకు ప్రతి నెల 15న జమ చేయాలన్నారు. జమ చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా రూ.266 కోట్ల బకాయిలు ఉన్నాయని నాయకులు తెలిపారు. సానుకూలంగా స్పందించిన అధికారి విషయాలను కమిషనర్ అఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ వారికి వివరించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. .

నేటి నుంచి 36 గంటల నిరాహార దీక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించకూడదని అన్ని పార్టీల మద్దతు కోరుతూ ఆ బిల్లుకు నిరసనగా 36 గంటల నిరాహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకుడు పి.ఎస్.సయ్యద్ గౌస్ పీర్ సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణితో నేడు వక్ఫ్ భూములు, రేపు క్రైస్తవ భూములు, ఎల్లుండి హిందూ మాన్యాలపై ఇలాంటి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. మనం కలిసికట్టుగా జాగ్రత్తగా ఉండాలని, ఈ సవరణలు ప్రజాహితం కాదని, సవరణకు వ్యతిరేకంగా అందరు మద్దతు కోరుతూ ఈనెల 2న పాత రిమ్స్ దగ్గర 36 గంటలపాటు నిరాహార దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీక్షకు ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా మద్దతు తెలపాలని కోరారు.

పార్టీని బలోపేతం చేయాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప : జిల్లాలోని మండలాల అధ్యక్షుల, మైనారిటీ శాఖ నాయకుల నియామకాలను అధికారికంగా ప్రకటించారు. నియామక పత్రాలను నాయకులకు కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షురాలు విజయ్ జ్యోతి, రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదా గాంధీ, నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో మరింత బలపరిచే విధంగా ప్రతి ఒక్కరు పని చేయాలని అన్నారు. నియామకాలు పొందిన వారందరూ పార్టీలో నిబద్ధతగా ఉండి కష్టపడి పని చేసి పార్టీ విజయాన్ని కృషి చేయాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎవిఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం పదవ తరగతి విద్యార్థులకు 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఫేర్వెల్ ఫంక్షన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వీర కమారి, సీఈవో ఏ ఎల్ వివేకానంద, పల్లవి, ప్రిన్సిపల్ ముని చంద్ర, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, క్యాంపస్ ఇన్‌ఛార్జి ఫక్రుద్దీన్, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

3న బడ్జెట్‌పై ప్రజా సంఘాల నిరసనలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగాన్ని, కార్మిక వర్గాన్ని, నిరుద్యోగులను విస్మరించేదిగా ఉందని, దీనికి వ్యతిరేకంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు మనోహర్, దస్తగిరి రెడ్డి, అన్వేష్ తెలిపారు. శనివారం బడ్జెట్ పై పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలకు ఈ బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. రైతులకు ధరల స్థిరీకరణ నిధి అపహస్యం చేసే విధంగా బడ్జెట్‌లో రూ.300 కోట్లు నిధులు కేటాయించడం దారుణమని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన విత్తనాల కోసం గత బడ్జెట్‌లో రూ.268 కోట్ల కేటాయించగా ఈ ఏడాది రూ.240 కోట్ల కేటాయించడం అన్యాయమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్షులు విజయకుమార్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎ.రామ్మోహన్, కార్మిక సంఘం నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప : చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, బడ్జెట్‌లో కేటాయింపులకు ఎలాంటి పొంతన లేదని, హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి. సతీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగభృతికి ఒక్క రూపాయి కేటాయించలేదని వాపోయారు. స్త్రీ నిధి పేరుతో ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఊసే లేదన్నారు. బడ్జెట్‌లో సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని తెలిపారు.

ప్రతి నెలా 1న పింఛను ఇవ్వడమే ధ్యేయం

ప్రజాశక్తి -కమలాపురం టౌన్ :అర్హులైన వారికి ప్రతి నెలా 1న పింఛను అందించడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. కమలాపురం నగరపంచాయతీ 3వ కౌన్సిలర్ పరిధిలోని జండా చెట్టు వద్ద వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధుల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తున్నానని పేర్కొన్నారు. వృద్ధాప్యంలో మరొకరిపై ఆధారపడకుండా సంతోషంగా జీవించాలన్నదే చంద్రబాబు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పగిడాల జనార్ధన్, ఎంపిడిఒ జ్యోతి, ముస్లిమ్ మైనార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, మండల కన్వీనర్ రాఘవరెడ్డి, పల్లె రామసుబ్బారెడ్డి, దాది రామయ్య అబ్దుల్ నబీ, నాగేంద్రారెడ్డి పాలగిరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులకు డిఇఒ షంషుద్దీన్ అవగాహన సదస్సు నిర్వహించారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు ఆఫీసర్లు, మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ దాదాపు 322 మంది చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటు ఆఫీసర్లు, 36 మండలాల మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమానికి విద్యాశాఖాధికారులు జి. రాజగోపాల్ రెడ్డి, యు. మీనాక్షి, డిసిఇబి సెక్రటరీ జి. విజయ భాస్కర్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గవర్నమెంట్ ఎగ్జామ్స్ జి. వెంకటేశ్ , డిస్ట్రిక్ట్ కో– ఆర్డినేటర్ ఓపెన్ స్కూల్ సాంబశివారెడ్డి, ఎగ్జామినేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఎం.రమేష్ సీనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నిరాశే

ప్రజాదృష్టి

బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావన లేకపోవడం తీవ్ర నిరాశను కలిగిస్తోంది. రాష్ట్రానికి చెందిన ముగ్గురు ముఖ్యమంత్రుల సాక్షిగా వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అందని ద్రాక్షను తలపిస్తోంది. 2007 నుంచి సుమారు రెండు దశాబ్దాలుగా ఊరిస్తూనే ఉంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో బ్రహ్మణీ పేరుతో తలపెట్టిన పరిశ్రమను అడ్డుకోవడానికి కొందరు నాయకులు అక్కడ సెలయేర్లు ప్రవహిస్తున్నాయని, జింకలు విహరిస్తున్నాయనే పేరుతో శతవిధాలా ప్రయత్నించిన సంగతి తెలిసిందే. అపస్వరాలను సమర్థంగా తిప్పికొట్టి 40 శాతంపైగా ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆయన మరణానంతరం ఉక్కు పరిశ్రమ యజమానిపై కేసుల పేరుతో అర్ధాంతరంగా ఆగిపోయిందనే కంటే ఆపివేసిన, ఆపివేయించిన వైనం గురించి అందరికీ తెలిసిందే. తాజాగా జెఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలోని ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని అటువంటి పరిస్థితే పునరావృతం అవుతోందనే వాదన వినిపిస్తోంది. 2014లో రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే హామీ అమలుకు ఆమడదూరంలో నిలవడం వెనక పాలకుల్లో చిత్తశుద్ధి లోపించడమే కారణమం. 2019 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఫీజుబులిటీ లేదనే పేరుతో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సహకరించని పరిస్థితి కనిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏర్పడిన ఎన్డీయే సర్కారు మనుగడకు టిడిపి, జనసేన ఆక్సిజన్ ఇస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టంలోని హామీని అమలు చేయించాల్సిన బాధ్యత వీటిపైనే అధికంగా ఉంది. వైఎస్ఆర్ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి. 2014 నుంచి కేంద్రంలో కొనసాగుతున్న ఎన్డీయే సర్కారు రాజకీయ అవసరాల ప్రాతిపదికన నిర్ణయాలతో ముందుకు సాగుతున్న నేపథ్యంలో రాష్ట్రానికి లభించిన అరుదైన అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. లేనిపక్షంలో భవిష్యత్ తరాలు క్షమించబోవనే సంగతిని రాష్ట్రంలోని కూటమి పార్టీలు గ్రహించాల్సి ఉంది. బ్రహ్మణీ, జెఎస్‌డబ్ల్యు వంటి ప్రయివేటు యాజమాన్యాలకు గిట్టుబాటయ్యే ఉక్కు పరిశ్రమ, ప్రభుత్వ రంగంలోని సెయిల్‌కు ఎందుకు గిట్టుబాటుకాదో సమాధానం చెప్పాలి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు గల అవకాశాలను యువతకు వివరించడంతోపాటు ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశాన్ని సజీవంగా ఉంచాల్సిన బాధ్యత ప్రజాసంఘాలు, పౌర సమాజంపైనే ఎక్కువగా ఉందనే చెప్పాలి. అప్పుడు మాత్రమే ప్రజలే పాలకులను ప్రశ్నించే రోజులు వస్తాయని చెప్పవచ్చు. లేకపోతే దశాబ్దాల తరబడి జిల్లా వాసులను పాలకులు మోసగిస్తూనే ఉంటారనే సంగతిని గ్రహించాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పోలీసుస్టేషన్‌లో 'ఓపెన్‌హౌస్'

ప్రజాశక్తి - కడప అర్బన్ : 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి రమాకాంత్ ఆధ్వర్యంలో శనివారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు పోలీస్ స్టేషన్‌లో పోలీసుల విధులు, ఉపయోగించే రికార్డులు, వినియోగించే వస్తువుల గురించి ఓపెన్ హౌస్ ద్వారా వివరించారు. మహిళా చట్టాలు, ఫోక్సో ఆక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్ పై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పిఎస్ ఇన్‌స్పెక్టర్ఎం.కృష్ణారెడ్డి, ఎహెచ్‌టియు ఇన్‌స్పెక్టర్ జి.ఈదురు బాషా, ఎస్ఐలు సి.శ్రీనివాసులు, కె.శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఉమ్మడి కడప జిల్లా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జియోన్ కళాశాలలో ఈనెల 3,4 తేదీల్లో సాయంత్రం 4 గంటలకు మహిళా ఉద్యోగులకు ఆటలు పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, రాష్ట్ర ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు నిర్మల జ్యోతి, జిల్లా అధ్యక్షులు శాంతమ్మ, కన్వీనర్ భారతి, సిటీ మహిళ అధ్యక్షులు గౌరీ, జ్యోతి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, వార్డు, సచివాలయంలో పని చేసే మహిళా ఉద్యోగులు పాల్గొన్ని ఆటల పోటీలు విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఆడపిల్లలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : ఆడపిల్లలు ప్రోత్సహించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శనివారం బేటి బచావో బేటి పడావో ప్రోగ్రాంలో భాగంగా దౌలతాపురంలో పాప పుట్టిన సందర్భంగా మొక్కను నాటించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలు ప్రతి ఒక రంగంలో రాణిస్తున్నారన్నారు. అటువంటి వారిపై చిన్న చూపు తగదన్నారు.కార్యక్రమంలో జిఎం ఎస్.కె. సాయి తేజ పాల్గొన్నారు.

టిడిపి నాయకులు పీరయ్య ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి నాయకులు, బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పోతుగంటి పీరయ్య హైదరాబాద్ స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల టిడిపి నాయకులు అమీర్ బాబు, బాలరాజు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించడం ముదావహం

ప్రజాశక్తి -కడప అర్బన్ :

విలువైన గ్రంథాలకు నెలవైన సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని మరోసారి సందర్శించడం ముదావహమని సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం ఉదయం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఉద్యోగులంతా కలసి ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కృషితో రూపొందిన సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రభుత్వ సహకారంతో యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో, ఔత్సాహికుల నిరంతర శ్రమతో కొనసాగుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా నారాయణ పాఠశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి- గోపవరం

వార్షికోత్సవ వేడుకల్లో అతిథులు

బద్వేల్ పట్టణం లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 14వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపల్ జి కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎజిఎం నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ వాకమల్ల నరసింహారెడ్డి, బద్వేల్ అర్బన్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ యాదవ్, గోపవరం తహశీల్దార్ త్రిభువన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా హాజరైన ప్రముఖులు విద్యార్థులను ఉద్దేశించి వారి అనుభవాలను తెలియజేస్తూ తల్లిదండ్రులతో పంచుకున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో స్కూల్లో పనిచేసే ఉపాధ్యాయులదే కాదని, వారి తల్లిదండ్రుల బాధ్యత కూడా ప్రధానంగా అవసరమని వారు తెలిపారు. అనంతరం విద్యార్థులచే పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ అధ్యాపక బృందం, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

35వ డివిజన్‌లో పింఛను పంపిణీ

ప్రజాశక్తి-కడప అర్బన్

పింఛను పంపిణీ చేస్తున్న విఆర్ఒ రాధిక

నగరంలోని 35వ డివిజన్‌లో విఆర్ఒగా పనిచేస్తున్న రాధిక శనివారం ఉదయం 7 గంటలకు పింఛన్లను పంపిణీ చేశారు. పంపిణీ పూర్తయిన తరువాత వూట్ల నారాయణ అనే వ్యక్తి ఆరోగ్యం బాగోలేక కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఆమె స్వయంగా ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు. విఆర్ఒ ఉద్యోగ కర్తవ్యంపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ఆమెను 35 డివిజన్ టిడిపి ఇన్‌ఛార్జి పి.మన్సూర్ అలీ ఖాన్ ప్రశంసించారు. కష్టపడి పని చేసేవారు తమ డివిజన్‌లో ఉండడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- కడప అర్బన్ : జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కడప వ్యవసాయ అధికారుల సంఘ భవన సమావేశ మందిరంలో సదరు సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షులుగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా ఓబులేసు, కార్య దర్శిగా బి. కృష్ణ సుమంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శ్యాంబాబు, కోశాధికారిగా పట్నం పద్మజను, సంఘ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడప జిల్లా వ్యవసాయ అధికారుల సంఘ గౌరవ అధ్యక్షులుగా యం. నాగరాజ ఎన్నుకున్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప : మహిళా దినోత్సవ వారోత్సవాలు జయప్రదం చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పిలుపునిచ్చారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రాంగణంలోని డి – బ్లాక్ నుండి 'భేటీ బచావో – భేటీ పడవో' అనే నినాదంతో బైక్ ర్యాలీని జెసి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కలెక్టరేట్ కార్యాలయం నుంచి ఎర్రముక్కపల్లి సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్ మీదుగా తిరిగి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, మెప్మా, డిఆర్‌డిఎ, మహిళా సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మానవత సంస్థ సభ్యులు

'మానవత' ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం శ్రీలక్ష్మీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో అంబకపల్లి రోడ్డులోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మానవత సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి, ఆగ్రో సంస్థ మేనేజర్ సిద్ధారెడ్డి, ఈ కూలింగ్ వాటర్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ముగిసే ఈ చలివేంద్రం ప్రజల దాహార్తిని తీరుస్తుందని నిర్వాహకులు కృష్ణమూర్తి చెప్పారు. ఈ సందర్భంగా 'దీనబంధు' కృష్ణమూర్తి బియ్యం బస్తాను వితరణ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఆర్ యజమాని చంద్రశేఖర్‌రెడ్డి, పెన్షనర్ సంఘ అధ్యక్షులు ఎవి గోపాల్‌రెడ్డి, మానవత అధ్యక్ష, కార్యదర్శులు జయరాజ్, గంగిరెడ్డి, డివి కొండారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సివి రంగారెడ్డి, జీవంద్రశేఖర్ రెడ్డి, శివరామిరెడ్డి, విశ్వనాథరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ హరీష్ చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జయప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్న బాలుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి సహకారంతో మాస్టర్ రాజా ఆధ్వర్యంలో శ్రీరాజా కళా నిలయం, పులివెందుల విద్యార్థులచే వెస్టర్న్, మొదలగు నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వితంతు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పుల్లయ్య తోట వీధిలో అక్బర్ అనే పింఛన్‌దారుడు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కుటుంబాన్ని ఆదుకోనేందుకు అతని భార్య షేక్ బీబీకి నెలలోపు కొత్త వితంతు పింఛన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పింఛన్‌ను శనివారం ఆమెకు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ అందజేశారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేల నుండి రూ.4 వేలకు పింఛన్ పెంచి ఇస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు శివయ్య, శివ, చిన్నబి, నాగేంద్ర పాల్గొన్నారు.

తులసిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్లు

కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పట్టణ అధ్యక్షులుగా అనిల్ కుమార్ రెడ్డి, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడుగా బీగాల రామకృష్ణ, లింగాల అధ్యక్షుడుగా శివశంకర్ రెడ్డి, సింహాద్రిపురం మండల శాఖ అధ్యక్షుడిగా ఆనంద్ కుమార్‌రెడ్డి, తొండూరు మండల అధ్యక్షుడుగా వినోద్‌కుమార్ రెడ్డి, వేముల అధ్యక్షుడుగా వెంకటేష్, చక్రాయపేట మండల అధ్యక్షుడుగా రామాంజనేయులురెడ్డి నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం పులివెందుల సమన్వయకర్త ధ్రువకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్షులుగా పదవులు పొందిన వారందరూ వేంపల్లెలో ఉన్న తులసిరెడ్డిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండాను ఎగుర వేసేలా పని చేయాలని కోరారు. మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ పులివెందులకు కంచుకోట అన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి గణనీయంగా ఓట్లు వచ్చినట్లు చెప్పారు. నియోజక వర్గం వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను, వైసిపి తీరును ఎండగట్టాలని మండల కన్వీనర్లకు తులసిరెడ్డి సూచించారు.

బ్రహ్మయ్యకు తులసిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - వేముల

కాలు గాయమై బాధపడుతున్న మండల టిడిపి ఇన్‌ఛార్జి బ్రహ్మయ్యను పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పరామర్శించారు. శనివారం ఉదయం ఆయన స్థానిక వాగేలేరు గ్రామంలోని బ్రహ్మయ్య నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య ఆరోగ్యం వివరాలను తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, శ్రీను పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 5, 6తరగతుల్లో బ్యాక్‌లాగ్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ హరిత ఒక ప్రకటనలో తెలిపారు. తొండూరు మండలంలోని పులివెందుల కేంద్రంగా పనిచేస్తున్న మహాత్మ జ్యోతి బాపూలే బిసి గురుకుల (బాలికల) పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశానికి బిసి, ఇబిసి, ఎస్‌సి, ఎస్‌టిలు ఈ నెల 2వ తేదీ నుండి 15 వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విద్యార్థులు చివరి 3, 4 తరగతులు ఇదే జిల్లాలో చదివి ఉండాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.లక్షకు మించి ఉండరాదన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రవేశ పరీక్షలో మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆర్‌టిడి కళాశాలలో ఘనంగా ఫేర్వెల్ డే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యాజమాన్యం

స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో శనివారం ఫేర్వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ తరుణ్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా ఇష్టంతో శ్రమిస్తే అది ఎంత పని అయినా సాధ్యమన్నారు. ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాల విద్య అయిపోయిన తర్వాత మీరందరూ ఉన్నత విద్యను అభ్యసించి మళ్లీ కళాశాలకు ఒక గెస్ట్‌గా రావడానికి కృషి చేయవలసిన బాధ్యత మీపై ఉందన్నారు. తల్లిదండ్రుల ఆశ, ఆశయాలను సాధించే దిశగా నిరంతర శ్రమ ద్వారా అది సాధ్యమవుతుందని, ఆర్టిడి కళాశాల సేవకు మారుపేరుగా ఉందని కొనియాడారు. గురుదేవ్‌రామ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రేమ, సంకల్పం, నిరంతర శ్రమ ద్వారా అత్యున్నత స్థానం చేరుకోవడానికి రానున్న తరాలకు మీరు మార్గదర్శిగా కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథి అంకాల కొండయ్య మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్ సుబ్బరాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజు పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అంతే సంగతులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మౌలిక సదుపాయాల కల్పన కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంటోంది. రహదారులు, వంతెనల మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని వాహనదారుల ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. కడపకు వెళ్లే ప్రధాన మార్గంలో మండల పరిధిలోని బెస్త కాలనీ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా నిర్మించిన వంతెనకు ఓవైపు రక్షణ గోడ పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో ప్రతినిత్యం వందలాది వాహనాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఓ వాగుపై నిర్మించిన ఈ వంతెనకు సంబంధించి రక్షణ కూడా ఓవైపు కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకున్న నాధుడే కరువయ్యారని ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. వాహనదారులు ప్రమాదవశాత్తు అదుపు తప్పి వాగులో పడితే ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు పేర్కొం టున్నారు. వంతెనకి ఇరువైపులా రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రోడ్ల భవనాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులను కోరుతున్నా పట్టించుకున్న నాథులే కరువయ్యారని ప్రజలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవన్నారు. కూటమి ప్రభుత్వమైన చర్యలు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై నిర్మించిన వంతెనకు ఓవైపు దెబ్బతిన్న రక్షణ గోడ

పన్ను వసూళ్లతో పంచాయతీలు అభివృద్ధి

పన్నులు సకాలంలో, వంద శాతం వసూలు చేయాలి : జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

వానపాములు వదులుతున్న జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - ముద్దనూరు

పెండింగ్ బకాయిలు పన్నులు, పన్ను ఇతరములు వంద శాతం వసూళ్లు చేసి గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సిబ్బందికి సూచించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం రాజ్యలక్ష్మి తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, ఇతరాలు ఈనెల 31 లోపు వంద శాతం వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. దీనిపై ప్రత్యేకదృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. మురుగునీరు, వ్యర్థాలను రోడ్లపై వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీని ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేకచర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కాలనీ ప్రజలకు తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వర్మీకం తొట్లలో వానపాములను వదిలారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి వీర భద్రుడు, రిసోర్స్‌పర్సన్ పుల్లారెడ్డి, కార్యదర్శి లక్ష్మీ నరసింహులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

సింహాద్రిపురం : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపిఆర్డి పద్మనాభరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని గురజాలలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో తడి పొడి చెత్త డబ్బాలను ప్రజలకు అందజేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చెత్తను అందులో వేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని కోరారు. పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. చెత్తను ఎవరు రోడ్డుపైన వేయకూడదని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

తడిపొడి చెత్త డబ్బాలను చూపిస్తున్న ఇఒపిఆర్‌డి పద్మనాభ రెడ్డి

మంచి, చెడులపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డిఎస్‌పి భవాని

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ట్రైనీ డిఎస్‌పి భవాని ఆధ్వర్యంలో ఎస్ఐ చిన్న పెద్దయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి భవాని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల వసతులు అందుబాటులో ఉన్నాయని. వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కౌమార దశలో ఉన్న బాలికలు మంచి చెడులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చుట్టూ ఉన్న వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సమాచారం అందివాలన్నారు. సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం ఎస్ఐ చిన్న పెద్దయ్య విద్యార్థినులకు పలు అంశాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఎర్రగుంట్ల : విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలని సిఐ నరేష్ బాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం జడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థినులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆత్మరక్షణ వ్యూహాలు, సైబర్ బెదిరింపులు పట్ల విద్యార్థినులకు సిఐ అవగాహన కల్పించారు. వారికి పోలీస్‌స్టేషన్ విధులను వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే రికార్డ్స్, ఉమెన్ హెల్ప్ డెస్క్ ప్రాముఖ్యత, అత్యవసర ఫోన్ నెంబర్ల వివరాలు, ఆయుధాలు, మహిళా చట్టాలు గురించి తెలిపారు. ఎస్‌పి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు సిఐ తెలిపారు. పోలీసులు, విద్యార్థి నులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిఐ నరేష్‌బాబు

ఎండియు ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి

- 15 వరకు రేషన్ పంపిణీ చేయాల్సిందే : చంద్రిక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నిత్యావసర సరుకులు లబ్ధిదారులకు ఎండియు వాహనం ద్వారానే పంపిణీ చేయాలని, ఖచ్చితమైన తూనికలు పాటించాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి చంద్రిక ఆదేశించారు. మండలంలో, పట్టణంలో జరుగుతున్న నిత్యావసర సరుకుల తీరును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రిక మాట్లాడుతూ ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతినెల 15వ తేదీ వరకు పంపిణీ చేయాలని ఆదేశించారు. పంపిణీ విధానాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పంపిణీ చేసే వారికి కూడా తుగు సూచనలు జారీ చేశారు. రెండు నెలలుగా కందిబేడలు రాలేదని లబ్ధిదారులు ప్రశ్నించగా ప్రభుత్వం నుంచి షార్టేజ్ ఉన్నందున రాలేదన్నారు. మరో రెండు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఆర్‌డిఒ చిన్నయ్య, తహశీల్దార్ మహమ్మద్ నజీర్, డిటి సుధీర్, విఆర్ఒలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌కు అనారోగ్యం : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పరిశీలిస్తే ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సిక్ (తీవ్రమైన అనారోగ్య) పథకాలుగా మారాయని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి విమర్శించారు. తన ఇంట్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేలవంగా ఉందన్నారు. చంద్రబాబు స్వలాభం కోసం ప్రజల్ని నమ్మించి మోసం చేశారని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కరెంటు ఛార్జీలు, వాహన పన్నులు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. కూటమి పాలనలో సంతోషం, శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని ఎపి ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అమృత్‌నగర్‌కు చెందిన వాణి అనే మహిళ శుక్రవారం ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరిందన్నారు. ఆరోగ్యంగా ఉన్న తల్లిబిడ్డ జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్ట్ యశశ్విని చేయాల్సిన ప్రసవాన్ని ట్రైనీ డాక్టర్లు చేయడంతో బిడ్డ మరణించిందని ఆరోపించారు. పర్యవేక్షణలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విఫలమయ్యారని పేర్కొన్నారు. స్వీపర్లు కూడా అక్కడ ప్రసవం చేయడం గమనార్హమన్నారు. ఇలాంటిసంఘటనలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పసుపుల శివకృష్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎలుకలకు ఆవాసాలు.. రేషన్ గోడౌన్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లోని రేషన్ బియ్యం మూటలు చిరిగిపోవడంతో ఎలుకలకు ఆవాసాలుగా మారిన వైనం పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వాణిరెడ్డి ఆకస్మిక తనిఖీల్లో బయటపడింది. స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని పౌరసరఫరాల శాఖ గోడౌన్‌ను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 42 మంది హమాలీలు ఉండవలసిన చోట 16 మందితో పనులు చేస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీల గైర్హాజరుతో రేషన్ డీలర్లకు ఆలస్యంగా సరుకులు చేరుతుందన్నారు. తనిఖీల్లో భాగంగా ఆమె గోడౌన్‌లోని స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ కావడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలకు బియ్యం పంచదార, కందిపప్పు సరఫరా హమాలీల గైర్హాజరు కావడంతో ఆలస్యంగా జరుగుతుందన్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లో నుండి లారీలలో ప్రొద్దుటూరుకు తరలించిన రేషన్ బియ్యాన్ని లారీలకు లోడ్ చేసి అన్లోడింగ్, లోడింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్న సిబ్బందిని, నిబంధనలు అతిక్రమిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

లింగ నిష్పత్తి సమానత్వం అందరి బాధ్యత

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీలత ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి రోజు బైక్ ర్యాలీ ద్వారా బేటి బచావో.. బేటి పడావో, అమ్మాయిలను రక్షించండి.. అమ్మా యిలను చదివించండి అనే నినాదాలు చేశారు. స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుండి పాత బస్టాండు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సమానత్వ లింగ నిష్పత్తిని పెంచడం, తద్వారా దేశ ఆర్థిక అభివృద్ధి సాధించడం జరుగుతుందని శ్రీలత పేర్కొన్నారు. కార్యక్రమంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ రామాంజనేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు నాగేశ్వరి, సరిత, మెప్మా ఆర్‌పిలు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీకి మంచి నీటిసరఫరా అందించే నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ మోటర్ల మరమ్మతులను శనివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆఫీస్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ రాముడు, డిఇతో కలిసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. దెబ్బతిన్న మోటర్లకు వెంటనే మరమ్మతులు చేసి సకాలంలో ప్రజలకు మంచి అందించాలని అధికారులకు సూచించారు. వేసవిలో ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకూడదని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎర్రంపల్లి అజయ్

సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రంపల్లి అజయ్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడుతూ పరీక్ష కేంద్రాలకు చేరుకుంటూ ఉంటారు. విద్యార్థుల ప్రయాణల నిమిత్తం ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు చల్లని మినరల్ వాటర్ ఏర్పాటు చేయాలన్నారు. గదుల్లో ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా చూడాలన్నారు. బాత్రూమ్స్ కూడా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రమేష్ , సహాయ కార్యదర్శి అరవింద్, నాయకులు సిద్దు, కిషోర్ పాల్గొన్నారు.

అసభ్యంగా మాట్లాడారనే 'పోసాని' అరెస్టు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సభ్యసమాజం తలదించుకునేలా పోసాని కృష్ణమురళి మాట్లాడారని జనసేన కో-ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అండతో సహ నటుడు, ఒక పార్టీ అధినేత అని కూడా పవన్‌కల్యాణ్‌ను చూడకుండా ఇష్టానుసారంగా నోటికి వచ్చినట్లు మాట్లాడడం వల్లే సంకెళ్లు వేశారన్నారు. ఇలా మాట్లాడేవారికి ఇది ఒక గుణపాఠం కావాలన్నారు. చంద్రబాబు, లోకేష్‌ను కూడా పోసాని తిట్టిన విషయం తెల్సిందే అన్నారు.

కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పశువైద్య విద్యార్థులు

పశువైద్య విద్యను చులకనగా చూడకండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్టయిఫండ్ విషయంలో పశువైద్య విద్యార్థులను చులకనగా చూడవద్దని విద్యార్థులు ప్రభుత్వాన్ని కోరారు. గోపవరం పంచాయతీలోని పశు వైద్య కళాశాలలో వారు చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమకు గౌరవ వేతనం పెంచాలని దీక్ష చేపడుతున్నా ఉన్నత అధికారులు, రాజకీయ నాయకులను కలిసినా వారు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం స్టయిఫండ్ పెంచే దీక్షలు విరమించేది లేదన్నారు.

హుండీ ఆదాయం రూ.3.34 లక్షలు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి ఆలయానికి గతంలో కంటే రూ.1.50 లక్షలు ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ పివి నారాయణ యాదవ్, ఇఒ కె.శ్రీనివాసులు తెలిపారు. శివరాత్రి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన 3 తాత్కాలిక హుండీల ద్వారా ఆదాయం రూ.3,34,769 వచ్చిందన్నారు. స్పెషల్ దర్శనం రూ.10టికెట్ ద్వారా రూ.62,440, ప్రత్యేక దర్శనం రూ.100 టికెట్ ద్వారా వచ్చిన ఆదాయం రూ.95,000 ఆదాయం వచ్చిందన్నారు. తలనీలాల వల్ల వచ్చిన ఆదాయం రూ.20,800, ఖాళీస్థలాలు (అంగళ్ళు) ద్వారా వచ్చిన ఆదాయం రూ.49,120వచ్చిందన్నారు. మొత్తంగా సేవ టికెట్స్ వల్ల రూ.2,27,360 ఆదాయం వచ్చిందని వివరించారు. లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.94,400, పులిహోరా అమ్మకం ద్వారా రూ.15,600 ఆదాయం వచ్చిందన్నారు. అన్నదానసత్రంలో రూ.1,41,008 ఆదాయం వచ్చిందన్నారు. ఉత్సవాల విజయవంతానికి కృషి పోలీసులకు, ట్రాన్స్‌కో, రెవెన్యూ, పంచాయతీ, ఆలయ సిబ్బంది, ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఫిబ్రవరి 24న లింగాల మండలం దిగువపల్లి గ్రామానికి చెందిన పప్పూరి గంగిరెడ్డిని హత్య చేసిన కేసులో నిందితుడు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ బొర్రా ప్రతాప్‌రెడ్డిని శనివారం మధ్యాహ్నం పులివెందుల రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.వి రమణ పట్టణంలో అరెస్టు చేశారని డిఎస్‌పి మురళి నాయక్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫిబ్రవరి 24న నిందితుడు కేతిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మచ్చు కొడవలితో పప్పూరి గంగిరెడ్డిని హత్య చేశాడన్నారు. మృతుడి పెద్ద కుమారుడు యోగానందరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేశామన్నారు. ఈ హత్యకు ముఖ్య కారణం పొలం తగాదా అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నూర్ బాషా ఉన్నారు.

పలు హుండీల దొంగ..

వేముల : పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలలోని దేవాలయాల్లో హుండీల దొంతనం కేసుల్లో నిందితుడు ఎల్లుగారి కరుణాకర్‌రెడ్డిని శనివారం ఉదయం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పి ప్రవీణకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న వేల్పుల గ్రామంలో శ్రీఅభయ ఆంజనేయస్వామి, శ్రీవేణుగోపాల స్వామి దేవాలయాల హుండీలను బద్దలు కొట్టి అందులోని సొమ్మును దొంగలించారని తెలిపారు. నిందతుడు సత్యసాయి జిల్లా, తలుపుల మండలం, మావిళ్లపల్లె (మాయలోల్లపల్లి) గ్రామానికి చెందినవాడని తెలిపారు. తొండూరులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, పులివెందుల పరిధిలోని నామాలగుండు శివుడి దేవస్థానంలో కూడా హుండీని బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డాడని వివరించారు. కరుణాకర్‌రెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద నుండి దొంగలించిన డబ్బులను స్వాధీనం చేసుకుని, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

CHANGE OF NAME

I, BULLE JASHMITHA (Aadhar No.xxxxxxxx9664) D/o. B.Hema Kumar, Residing at D.No.42/368, Bhagya Nagar Colony, Kadapa-516001, Andhra Pradesh, Inda, have Changed my Name from B.Jashmitha (Old) to **BULLE JASHMITHA** (New Name).

పాస్‌పోర్ట్ పోయినది

వైఎస్‌ఆర్ జిల్లా, కడప నగరం, భాగ్యనగర్‌కాలని వాస్తవ్యులు, డోర్‌నెం.42/383-14, నివాసం ఉంటున్న చెన్నక్రిష్ణారెడ్డి గారి కుమారుడు డా॥ ఆరెం. శరత్‌కుమార్‌రెడ్డికి చెందిన పాస్‌పోర్ట్ 20.02.2025వ తేదీన జిరాక్స్ కోసం అప్సర సర్కిల్ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ దగ్గరకు వెళ్తున్నప్పుడు మార్గమధ్యలో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **X4845679** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 8919138440 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No. 634/2022

ఆలంపల్లి నాగరాజు, తండ్రి రామయ్య, వయస్సు 63 సం:లు, హిందూ, వ్యాపారం, సాకిన్ డి.నెం.5/1047-1, శ్రీరాం నగర్, దొరసానిపల్లె రోడ్డు, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, వై.యస్.ఆర్ జిల్లా. ......వాది

Vs.

షేక్ మహబూబ్ బాష, తండ్రి బాలె సాహెబ్, ముస్లిం, వయస్సు 49 సం:లు, వ్యాపారం, సాకిన్ డి.నెం. 7/65, చాకలి స్ట్రీట్, మైదుకూరు టౌన్ & మండలం, వై.యస్.ఆర్ జిల్లా. ..... ప్రతివాది

ప్రతివాదికి దావా సమను

పై నెంబరు దావాలోని వాది దావా మొత్తం రూ.19,99,000/-లు (అక్షరాల పంతొమ్మిది లక్షల తొంభై తొమ్మిది వేల రూపాయలు మాత్రము) రాబట్టుకొనుటకుగాను నీపైన దాఖలు చేసి వున్నాడు. అట్టి దావాలో ప్రతివాది అయిన నీ హాజరు కొరకు 10-04-2025వ తేదిన వాయిదా ఉంటున్నది. పై దావాలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 10-04-2025వ తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు యందు హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట నీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వు మేరకు //

వాయిదా తేది: 10-04-2025 — బి. రాం ప్రసాద్ రెడ్డి, అడ్వకేట్, ప్రొద్దుటూరు.